క్లుప్తంగా

పరిసరాల శుభ్రతే ముఖ్యం



వనపర్తి రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మూలంగా దోమల వ్యాప్తిని నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీహరినాథ్‌రెడ్డి అన్నారు. మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం పెబ్బేరు మండలంలోని సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులు, వాటిని నివారణ గురించి అవగాహన కల్పించారు. దోమల లార్వా పెరగకుండా నీటి నిల్వలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్‌ఎం అనురాధ, విద్యార్థులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఆకస్మిక మృతి

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల 33కేవీ సబ్‌స్టేషన్‌లో కొన్నేళ్లుగా ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుధాకర్ (50) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. సబ్‌స్టేషన్ వద్ద ఒక్కడే విధులు నిర్వహిస్తుండటంతో గుండెపోటు వచ్చిన సమయంలో ఎవరూ లేకపోవడంతో చనిపోయాడు. కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు శనివారం ఉదయం ఫోన్ చేయగా ఎంతకూ లిఫ్ట్ చేయకపోవడంతో సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి చూసే సరికి విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతుడు వీపనగండ్ల మండలం పుల్గచర్లకు చెందిన వ్యక్తి కాగా.. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు

వనపర్తి రూరల్: శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగుల వద్ద నీటి ప్రవాహం పెరగడంతో వెంకటాపురం నుంచి పెబ్బేరు వెళ్లే వాహనాలను శ్రీరంగాపురం మీదుగా దారి మళ్లించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం నుంచి పెబ్బేరు వెళ్లే రహదారిలో రెండు బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నందున భారీ వర్షాలకు వాగు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండంతో డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయిందన్నారు. దీంతో పెబ్బేరు వెళ్లే వాహనాలను దారి మళ్లించామని ఆయన తెలిపారు. పెబ్బేరు నుంచి వచ్చే వాహనాలను కంచిరావుపల్లి, శ్రీరంగాపురం మీదుగా వెళ్లాలని కోరారు.

అదుపు తప్పిన లారీ



ఆత్మకూర్: వేగంగా వెళ్తున్న లారీ టైరు ఊడిపోయిన ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. ఆత్మకూర్‌లోని మార్కెట్ యార్డు ముందు నుంచి అమరచింత వైపు లారీ వేగంగా వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా ముందు భాగంలోని ఎడమవైపు టైరు ఊడిపోయింది. సమయానికి అటువైపుగా ఇతర వాహనాలు రాకపోవడం, డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సహకారంతో లారీకి టైరును మార్చి మరమ్మతులు చేపట్టడంతో అప్పటి వరకు నిలిచిన వాహనాల రాకపోకలు కొనసాగాయి.

బాల్యవివాహాల నిర్మూలకు కృషి చేద్దాం

ఆత్మకూర్: బాల్యవివాహాల వల్ల ఎన్నో రకాల అనర్థాలు జరుగుతాయని, వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిరక్షణ విభాగం కౌన్సిలర్ స్వరూప మాట్లాడుతూ.. బాల్యవివాహ నిషేధ చట్టం 2006 గురించి క్లుప్తంగా వివరించారు. మహిళలు, పిల్లలకు సమస్యలు ఉంటే 100, 1810, 1098 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

కొత్తకోట రూరల్: వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సూచించారు. పోలీసులు సూచించిన htpp://policeportal.tspolice.gov.in/ సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘనలు జరిగినా నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.

ఎడతెరపి లేని వర్షం



గోపాల్‌పేటలోని అయోధ్యనగర్‌కాలనీలో నిలిచిన నీరు

ఆత్మకూర్: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి దాక భారీ వర్షం కురవడంతో డ్రెయినేజీలు ఉప్పొంగాయి. వర్షం నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాత నివాస గృహాల్లో నివాసముండే వారు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆత్మకూర్‌లో అంధకారం నెలకొంది. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపునీరు భారీగా చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

వనపర్తి రూరల్: భారీ వర్షాలతో మండలంలోని దత్తాయిపల్లి (చిన్నతండా) శివారులోని బిచ్చనాయక్‌కు చెందిన 2 ఎకరాల వరి పంట నీట మునిగింది. పొలానికి పైభాగంలో ఉన్న చెక్‌డ్యాం నిండి ఎక్కువైన నీటి ప్రవాహం అంతా పొలంపైకి రావడంతో వరి పంట నీటిలో కొట్టుకుపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువుల అలుగులు, మండలంలోని పలు గ్రామాల వాగులు, వంకలు పెద్ద ఎత్తున పారుతున్నాయి. వాగులు పొగిపొరడంతో రోడ్లకు ఏర్పాటు చేసిన కల్వర్టులపై నుంచి నీళ్లు పారుతుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పాండునాయక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్‌కుమార్ సూచించారు. రోడ్లపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపి వేసి అడ్డంగా కంపచెట్లు వేసి, సిబ్బందిని కాపలాగా ఉంచారు. శిథిలావస్థ ఇళ్లలో నివాసముంటున్న వారిని పంచాయతీ కార్యదర్శులు వెంటనే ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. వారి వెంట ఐబీ ఏఈ వెంకటేష్, ఆర్ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.

గోపాల్‌పేట: ఎడతెరపి లేని వర్షాలతో మండలంలోని కుంటలు, చెరువులు దాదాపు అన్నీ నిండి అలుగుపారాయి. కేశంపేట గేటు వద్ద ఉన్న కల్వర్టు వద్ద అత్యధికంగా నీరు పారుతోంది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు గోపాల్‌పేట మండలంలో 81.3, రేవల్లి మండలంలో 72.8 ఎంఎం వర్షపాతం నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. గోపాల్‌పేట మండల కేంద్రంలోని అయోధ్యనగర్‌లో నీరు చేరుకుని చిన్నపాటి చెరువును తలపించింది.



దత్తాయిపల్లి (చిన్నతండా) శివారులో నీట మునిగిన పంట



షాపురం రోడ్డుపై రాకపోకలను నిలిపేస్తున్న తహసీల్దార్, తదితరులు



ఆత్మకూర్‌లోని పాత మున్సిపల్ రోడ్డుపై..

కంట్రోల్‌రూం ఏర్పాటు



అమరచింత మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రం

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజు అన్నారు. కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశాలకు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో మండలంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ఉన్నవారు ఖాళీ చేసి వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, చెరువులు, కుంటలు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా నదీ తీరప్రాంతాలైన మూలమల్ల, జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరేపల్లి, కత్తెపల్లి, తూంపల్లి, రేచింతల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఘటన జరిగినా, ఎలాంటి సహకారం కావాలన్న 99084 42992, 96520 61830 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

అమరచింత: వర్షాల కారణంగా ప్రజల అవసరాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న మట్టి ఇళ్లతో పాటు కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తిస్తూ వాటిని ఖాళీ చేయాలని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించామన్నారు. అత్యవసర సహాయం కోసం ఫోన్‌నంబర్ 99631 26840, 96422 53317 లకు సమాచారం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే ఏదైనా సాధిస్తాం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ జగదీశ్వర్

వనపర్తి టౌన్: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించాలని, పట్టుదల, కృషితో సాధించలేనిది ఏది లేదని రిటైర్డ్ ఐఏఎస్ జగదీశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జాగృతి జూనియర్ కళాశాల వారు ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ ఎం.జగదీశ్వర్, డీఐఈఓ అంజయ్య, టీజీ పాలా జనరల్ సెక్రటరీ మురళీధర్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని, మనస్సు ప్రశాంతంగా ఉంటేనే చదివిన అంశాలను గుర్తుపెట్టుకోగలరని సూచించారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటూ ఎప్పటికప్పుడు రివిజన్ చేసుకుంటే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్, యాజమాన్య సభ్యులు శ్యాంకుమార్, భాస్కర్, సత్యనారాయణ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



ఉపాధ్యాయుడు శేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శేఖర్ శనివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శేఖర్ దంపతులను ఎమ్మెల్యే మెమొంటో ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని, ప్రతి ఉపాధ్యాయుడు నిస్వార్థంగా పనిచేస్తూ విద్యార్థులకు సత్ప్రవర్తనతో కూడిన చదువును అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, వరప్రసాద్, సత్యనారాయణ, గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కృష్ణుడి శోభాయాత్ర



కొత్తకోట రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పెద్దమందడి మండలంలోని బలిజపల్లిలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 26న కొలువుదీరిన శ్రీకృష్ణుడు 6రోజుల పాటు భక్తుల నుంచి విశిష్ట పూజలు అందుకున్నాడు. శనివారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజనలతో పాటు బొడ్డెమ్మలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల మధ్యన ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, నాగనందం, వెంకట్రాంరెడ్డి, పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, శైలజ, జ్యోతి, ప్రమీల, మంజుల, లయ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం

వీపనగండ్ల: భారీగా కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్ కోరారు. అకాల వర్షాల వల్ల ఎలాంటి ఆపద సంభవించినా మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

వీఆర్‌ఏలను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

అమరచింత: 55ఏళ్ల నుంచి 61 ఏళ్లలోపు వయసు గల వీఆర్‌ఏలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి శనివారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసేందుకు విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 81 వల్ల రాష్ట్రంలో 55 నుంచి 61 ఏళ్ల వయసు గల 2వేల మంది వీఆర్‌ఏ కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఒక్కనెల జీతం తీసుకోకుండానే 600 మంది పూర్వ వీఆర్‌ఏలు పదవీ విరమణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోభారంతో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వారికి హామీ ఇచ్చారు. వీఆర్‌ఏలు కావలి భీమ్ అర్జున్, కుమార్, నరసింహ, నాగరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి



భవనం ప్రారంభిస్తున్న పద్మశాలీలు

వనపర్తిటౌన్: పట్టణ పద్మశాలి సంఘం నూతన భవనాన్ని ట్రస్ట్ చైర్మన్ రావిరాల శ్రీనివాసులు, వైస్ చైర్మన్ గంజి గోపాల్ శనివారం జిల్లా కేంద్రంలోని బండారునగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీలందరూ సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, పట్టణ అధ్యక్షుడు శివరాములు, ప్రధాన కార్యదర్శి తిరుమల ఊషన్న, కోశాధికారి చిన్ని కర్ణాకర్ మాణిక్యం, సుధాకర్, ప్రభు, గంజి వెంకట్రాములు, గంజి రత్నమ్మ, తిరుమల తిరుపతమ్మ, వసంత, గోపినాథ్, శ్రీనివాసులు, రామయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పాలనలో ప్రజలకు తిప్పలు



గోపాల్‌పేటలో పైపులైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఫైల్)


- సమస్యల పరిష్కారానికి ఎదురుచూపులు
- ప్రతి గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు ఇబ్బందులు

గోపాల్‌పేట: ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయింది. ఇంకొన్ని నెలల పాటు అధికారుల పాలనే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. గ్రామాల్లో ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటిలో బండరావిపాకుల, కొండలపల్లి గ్రామాలు మునకకు గురికావడంతో ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో పనులు కొనసాగుతున్నాయి. మిగతా 25 గ్రామాల్లో తాగునీరు రెండు రోజులకోమారు వస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాంగన్ కాలనీలో రెండు నెలలకు పైగా భగీరథ నీరు రావడం లేదు. ఇదే కాలనీలో ముప్పైకి పైగా వీధిలైట్లు వెలగడం లేదు. కాలనీవాసులు అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఏదుట్లలోని మఠం కాలనీలో తాగునీటి ట్యాంకు పైకప్పు కూలిపోయి సీకులు తేలడంతో ఎప్పుడు ట్యాంకు కూలిపోతుందోనని సమీప ఇళ్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెన్నారంలో వీధిలైట్లు వెలగడం లేదని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు వాపోయారు. గోపాల్‌పేట సబ్‌స్టేషన్ నుంచి మండల కేంద్రంతో పాటు కొన్ని గ్రామాలకు కరెంటు సరఫరా అవుతోంది. నెల రోజుల నుంచి చిన్నపాటి గాలి వచ్చినా, లేదంటే వర్షం కురిసినా కరెంటు సరఫరా నిలిపేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేవల్లి మండలంలో సైతం సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా..



మా కాలనీలో నెల రోజుల నుంచి స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు వివరించినా స్పందన లేదు. రోజు కాలయాపన చేస్తున్నారే తప్పా.. సమస్య పరిష్కరించే నాథుడు లేడు. రాత్రివేళల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. చిన్న పిల్లలు ఉన్న ఇళ్లల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

– పరశురాములు, రాంనగర్ కాలనీ, గోపాల్‌పేట

సమస్యలు పరిష్కరిస్తాం



గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో లైట్లు వేశాం. కానీ వర్షాలు, గాలులకు కొన్ని పాడై ఉండవచ్చు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన వెంటనే లైట్లు బిగిస్తాం. తాగునీటి ట్యాంకు కొద్ది రోజుల క్రితం కడిగించాం. వర్షాలు కురుస్తుండడంతో కొత్త నీరు చేరి నీటి రంగు మారి ఉండొచ్చు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – శేఖర్, ఎంపీడీఓ, గోపాల్‌పేట

భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో సప్తాంగ పూజలు



ఎమ్మెల్యే శ్రీహరికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకుడు

అమరచింత: శ్రావణమాసం పురస్కరించుకుని చివరి శనివారం మండలంలోని సింగంపేటలో వెలసిన అడవి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పాంరెడ్డిపల్లిలోని ఆంజనేయ ఆలయంలో సప్తాంగ పూజలు ఘనంగా నిర్వహించారు. సింగపేట అడవి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే సప్తాంగ పూజల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాంరెడ్డిపల్లిలో భక్తులు ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు పవిత్ర కృష్ణానది జలాలతో స్వామివారిని అభిషేకించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయాబ్‌ఖాన్, నాయకులు అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌నరసింహరాజు, నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు



భజనలు చేస్తూ శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని కోట్ల ఆంజనేయస్వామి ఆలయంలో చివరి శ్రావణ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. పురాతనమైన, మహిమ గల కోట్ల ఆంజనేయస్వామి ఆలయంలో 30రోజులుగా అఖండ భజన, అఖండ జ్యోతిని కొనసాగించారు. హనుమంతుడికి భక్తులు అభిషేకాలు, ఆకుల పూజ అనంతరం భజనలు చేస్తూ, మహిళలు కోలాటాలు వేస్తూ శోభాయాత్రగా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, రామకృష్ణ, వేముల సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పాన్‌గల్‌లో కేక్ కట్‌చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినం వేడుకలను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ నాయక్, వెంకటయ్యనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను వివరిస్తూ.. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, బాలస్వామియాదవ్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, వీరసాగర్, కర్ణాకర్‌రెడ్డి, తిరుపతి యాదవ్, వెంకట్రాములుయాదవ్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హర్షవర్ధన్‌రెడ్డి పేదలు, రైతుల కోసం పని చేశారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ముంత మల్లయ్య యాదవ్ అన్నారు. కార్యక్రమంలో ముంత శివ, అయ్యన్న, కుర్మయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్ పాల్గొన్నారు.

నది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జలాశయం దిగువకు వెళ్లకుండా ముళ్లపొదలతో మూసివేసిన దారి

అమరచింత: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేష్ కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఆయన జూరాల జలాశయం సమీపంలోని చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, నందిమళ్ల, మూలమళ్లలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూరాల జలాశయానికి ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో దిగువకు నీటిని వదులుతున్నారని.. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. పర్యాటకులు నది దిగువ భాగంలోకి వెళ్లకుండా ముళ్లపొదలతో దారులను మూసి ఉంచామన్నారు. ఎలాంటి ప్రమాదం సంభవించినా వెంటనే డయల్ 100కు గాని స్థానిక పోలీసులకుగాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టు పరిసరాల్లో తమ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పొలాల్లోని విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు పడేటప్పుడు స్తంభాలు, తీగలను తాకరాదని సూచించారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

వనపర్తి రూరల్: పెబ్బేరు వైపు నుంచి బైక్‌పై వనపర్తికి వస్తూ.. ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి తలకు గాయాలయిన ఘటన శనివారం వనపర్తి ఏకో పార్కు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన గుజ్జుల శేఖర్ బైక్‌పై జిల్లాకేంద్రానికి వస్తుండగా వనపర్తి పట్టణ శివారులోని ఏకోపార్కు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఘటనపై బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.